క్లుప్తంగా

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామి వారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా ధ్వజారోహణ, పల్లకీ ఉత్సవం

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో రెండు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి పల్లకీ ఉత్సవం కనువిందుగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ బట్టార్, అర్చకులు రమేష్‌బాబు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ,పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరిపంచేశారు. కార్యక్రమంలో టీటీడీ ఈఓ వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, ఇన్స్‌పెక్టర్ డిశ్యాంత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో సోమవారం మదనపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధుల సహకారంతో నిర్వహించే వైద్య శిబిరాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శివన్న తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ గామిరెడ్డిగారిపల్లెకు చెందిన నాటుసారా విక్రేత వెంకటలక్ష్మమ్మ (52)ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న ఇంటిపై దాడులు నిర్వహించి నాటుసారా విక్రేతను అదుపులోకి తీసుకొని పదిలీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నామని ఆయన పేర్కొన్నారు. ఆమెపై కేసు నమోదు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచామన్నారు.

రైతులకు జలకళ పథకం వరం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



రైతులకు మోటార్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలకళ పథకం రైతులకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలికిరి సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో గతంలో జలకళ పథకంలో బోర్లు వేసిన పీలేరు, వాల్మీకిపురం మండలాల రైతులకు మోటార్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రాయలసీమ జిల్లాల్లో రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో జలకళ పథకం తీసుకువచ్చిందని, అయితే సాంకేతిక కారణలతో కాంట్రాక్టర్లు మొగ్గు చూపకపోవడంతో మొదటగా దరఖాస్తులు చేసుకున్న రైతులకు బోర్లు వేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇంకా రైతులు జలకళ పథకానికి దరఖాస్తు చేసుకుని, అర్హత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి అర్హులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు. జలకళ పథకంలో ఒక్కో రైతుకు బోరు, మోటారు, విద్యుత్ కనెక్షన్ సదుపాయం, స్టార్టరు మొత్తం రూ.8లక్షలు వరకు ఉచితంగా లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం బోర్లు వేసిన పది మంది రైతులకు రూ.35.5 లక్షలు విలువ చేసే మోటార్లు, స్టార్టర్లు, పైపులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కలికిరి క్లస్టర్ ఏపీడీ నందకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం పీలేరు మండల అధ్యక్షుడు కాకులారంపల్లి భాస్కర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కలకడ : వేసవిలో సమీపిస్తోం.. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ముదస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. ప్రతి గ్రామంలో ఉన్న నీటి సమస్యపై వారం లోపు పూర్తి నివేదికలు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. మండలంలోని రాతిగుంటపల్లె, దేవులపల్లె పంచాయతీలకు నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు సర్వీస్ లైన్ లాగాలని సభ్యులు డిమాండ్ చేశారు. రైతులకు మండలంలోని అన్ని ఆర్బీకెలలో రాయితీ విత్తనాలు, ఎరువులు అందించాలని మండల ఆర్బీకే చైర్మన్ హరినాథరెడ్డి కోరారు. ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వర్‌నాయుడు, సింగల్ విండో అధ్యక్షులు వెంకట్రమణ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఓటర్ల నమోదు ప్రత్యేక అధికారి రాఘవేంద్ర అకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ర్యాంపుల సౌకర్యంపై ఆరా తీశారు. అనంతరం కర్ణాటక సరిహద్దులో ఉన్న పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ విద్యాసాగర్, ఎంఈఓ నారాయణ, బీఎల్వోలు ఉన్నారు.

క్షయ నిర్ధారణలో ట్రూనాట్ మెషిన్ కీలకం

జిల్లా ఆస్పత్రిలో రూ.8లక్షల వ్యయంతో ప్రారంభం

మదనపల్లె : క్షయవ్యాధి నిర్ధారణలో సీబీ నాట్, ట్రూనాట్ మెషిన్ కచ్చితమైన ఫలితాలను ఇస్తూ, కీలకంగా పనిచేస్తుందని మెడికల్ కాలేజ్ సూపరింటెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్.జమున, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి అన్నారు. శనివారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో రూ.8లక్షల వ్యయంతో సీబీ నాట్, ట్రూనాట్ మెషిన్‌ను వారు ప్రారంభించారు. జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ ఆధ్వర్యంలో టీబీనివారణ కార్యక్రమంలో భాగంగా యంత్రపరికరం జిల్లాకు మంజూరైనట్లు చెప్పారు. గతంలో ట్రూనాట్ మెషిన్ రాయలసీమలో తిరుపతి రుయా ఆస్పత్రిలో మాత్రమే అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుచేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. ట్రూనాట్ మెషిన్ ద్వారా గంట వ్యవధిలో నలుగురు క్షయ అనుమానితులకు కచ్చితమైన వ్యాధి నిర్ధారణ ఫలితాలు అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వివిధ విభాగాల హెచ్ఓడీలు డాక్టర్.శివరామకృష్ణ, డాక్టర్.బాబు, డాక్టర్.శశికళ, డాక్టర్.అమరనాథరెడ్డి, డాక్టర్.అరుణ, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగశ్రీ, టీబీ విభాగం ప్రభాకర్, శాంతి, జ్ఞానతిలగం,సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సురక్షిత ప్రసవం

పీలేరు : ప్రభుత్వాస్పత్రిలోనే సురక్షిత ప్రసవం సాధ్యమని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం తలపుల పీహెచ్‌సీలో 'ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు విధిగా కాన్పుకు ముందు వైద్యులచే పరీక్షలు చేపించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్, బరువు తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, ఏఎన్ఎం ఫామున్నీషా, నాగవేణి, సీహెచ్‌వో కుముదా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు టెక్నాలజీ ఉపయోగించుకోవాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించుకోవాలని మోహన్‌బాబు యూనివర్సిటీ అసోసియేటివ్ ప్రొఫెసర్ గౌతమ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2024 నేషనల్ లెవల్ ప్రాజెక్టు ఎగ్జిబిషన్, పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కొత్త రకాల ప్రాజెక్టులు తయారు చేయాలని సూచించారు. కొత్త ప్రాజెక్టులు తయారు చేసి భవిష్యత్తులో ముందుకెళ్లాలని తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల టెక్నికల్, నాన్ టెక్నికల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

గుర్రంకొండ : ప్రతిభ కలిగిన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. శనివారం స్థానిక తెలుగు ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ ఏ 3 పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇదే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు సికిందర్ ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తే మరింత మంచి ఫలితాలు వస్తాయన్నారు.హెచ్ఎం సాంబశివ, ఉపాధ్యాయులు శిరీష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలి

పీలేరు రూరల్ : డ్రైవర్లు నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలని ఆర్టీసీ పీలేరు డిపో మేనేజర్ బి.కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో ఆర్టీసీ కార్మికులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రైవర్లు సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. సురక్షితమైన డ్రైవింగ్ జీవితాలను కాపాడుతుందని తెలిపారు.

ప్రతి హామీని అమలు చేసిన ఘనత జగనన్నదే

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



సమస్యలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

ములకలచెరువు : గత ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని మద్దినాయునిపల్లి సచివాలయ పరిధిలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్ళి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వానికి రాబోవు ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో వేసే ప్రతి ఓటూ ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలని హితబోధ చేశారు. జగనన్న పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, నీటి వసతి కల్పించామన్నారు. విద్యుత్ సమస్య లేకుండా సబ్‌స్టేషన్‌లను మంజూరు చేశామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారన్నారు. ఎన్నికలు దగ్గర పడటంతో మళ్లీ మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాడన్నారు. ఆయన వెంట నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్ మైనారిటీల పక్షపాతి



షమీమ్‌అస్లామ్‌ను సన్మానిస్తున్న నిసార్‌అహ్మద్, మనూజారెడ్డి తదితరులు

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా షమీమ్‌అస్లామ్‌కు రెండోసారి అవకాశం కల్పించడంపై ఘనంగా సన్మానించారు. శనివారం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి నిసార్‌అహ్మద్ ఎన్‌వీఆర్ లేఅవుట్‌లోని షమీమ్‌అస్లాం స్వగృహానికి వెళ్లారు. రాష్ట్రస్థాయి కేబినెట్ హోదా పదవిని రెండోసారి దక్కించుకోవడంపై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ... కష్టపడేవారికి వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం కల్పిస్తారనేందుకు షమీమ్‌అస్లామ్ నిదర్శనమన్నారు. ముస్లిం మైనారిటీ మహిళనైన తనను గుర్తించి, రాష్ట్రస్థాయి పదవిని కేటాయించిన సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు డిష్ రామకృష్ణారెడ్డి, ఎస్వీ.రమణ, ఎం.వి.రమణ, రామిశెట్టిశివయ్య, ప్రసాద్‌బాబు, ముబీనా, సుగుణ, పాల్‌చంద్రశేఖర్, రేణుక, ఈశ్వర్‌నాయక్, నాయకులు సాయిశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, పసుపురవి, సలీం, చరణ్, నరిబాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన డీఈఓకు సన్మానం

పీలేరు రూరల్ : అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యు.శివప్రకాష్‌రెడ్డిని శనివారం పీలేరు ఎస్టీయూ నాయకులు కలసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు గంగిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నూతన డీఈవో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, పీలేరు మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ అమరనాథ్‌రెడ్డి, కలకడ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక పాలదిగుబడి

తంబళ్లపల్లె : పాడి రైతులు పశుపోషణలో మెలకువలు పాటిస్తూ పౌష్టికాహారం ఇచ్చినప్పుడే అధిక పాల దిగుబడి, ఆదాయం పొందవచ్చునని శ్రీజ డెయిరి జోనల్ మేనేజర్ లింగారావు తెలిపారు. శనివారం స్త్రీ శక్తి భవనంలో మదనపల్లె జోనల్‌స్థాయి ఏరియా ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాడిరైతులతో పశుపోషణపై అవగాహన కల్పించాలన్నారు. ఏరియా ఆఫీసర్లు గంగయ్య, మునికృష్ణ, నారాయణరెడ్డి, క్రిష్ణప్ప, గోవిందప్ప పాల్గొన్నారు.

In The Court of the Additional Senior Civil Judge: Madanapalli

O.S.No.22/2021

Plaintiff : Bodumallu Akkulamma and Others

//Vs//

Defendants :Bodumallu Mangamma and Others

Notice / Summons to Defendant No20

Muggipindi Narayana S/o M.Venkatappa, D.No.3-118, Bodumallu Dinne, H/o Basinikonda Village, Madanapalli Mandal, Annamayya District.

పై తెలిపినటువంటి కేసులో రాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 04.03.2024వ తేది న ఉదయం 10.30 గంటలకు హాజరుకావలెనని రాజశ్రీ కోర్టు వారు ఆదేశించడమైనది. కావున మీరు కాని మీచే నియమించబడిన న్యాయవాదిగాని పై తేదిన పై గంటలకు మీరు హాజరు కాని ఎడల మీ పరోక్షములో రాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు పాలించబడును.

// By Order of the Court //

వాది : బోడుమల్లు అక్కులమ్మ

బి.యం. రెడ్డి, M.Com.,LLB
జి. మల్లికార్జున, M.Com.,LLB
కె.శ్రీనివాసులు, B.A.,LLB
పి.కె.ఆర్. శేషుకుమార్, M.Ph.LLB
అడ్వకేట్స్, మదనపల్లి